మహబూబ్‌నగర్ వార్త



నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట


## మేయర్, డిప్యూటీ మేయర్‌పై

# తొలగని సందిగ్ధత

- మేయర్ స్థానానికి పోటీ మైనార్టీలకు కేటాయిస్తారా..?
- డిప్యూటీ మేయర్ కన్ఫామ్‌గా ఆయనకేనా..
- సీల్డ్ కవర్లో భవితవ్యం..?

మరికొన్ని గంటల్లో ఉత్కంఠ



**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ఫలితాలు వెలువడినా రెబెల్ అభ్యర్థులతో మ్యాజిక్ ఫిగర్ దాటినా మేయర్, డిప్యూటీ మేయర్‌లపై ఉత్కంఠ ఇంకా తొలగనట్లు తెలుస్తున్నది. మహబూబ్‌నగర్ కార్పొరేషన్ మేయర్ పదవి బీసీ మహిళకు రిజర్వ్ అయిన నేపథ్యంలో ఇద్దరూ బీసీ మహిళలు పోటీ పడుతున్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా మైనార్టీలు కూడా బీసీ కోటాలోనే రానుండగా మైనార్టీల నుంచి కూడా మరో ఇద్దరు పోటీలో ఉన్నట్లు సమాచారం. ఎవరు మేయర్ అవుతారు అనే ఉత్కంఠకు మరికొన్ని గంటల్లో తెరపడనున్నది.

### తెరమీదకి మైనార్టీలు..

మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికలు రసవత్తరంగా మారాయి. రోజుకు ఒక మలుపు తిరుగుతూ మరింత హీటెక్కిస్తున్నాయి. మొన్నటిదాకా మేయర్ పీఠం ఆశావహుల్లో ప్రధానంగా నలుగురు అభ్యర్థులు ఉండగా అందులో ముడా చైర్మన్ లక్ష్మణ్ యాదవ్ సతీమణి, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు ఎంపీ వెంకటేష్ కూతురు నేహ శ్రీ ఓటమిపాలు కావడంతో మాజీ మున్సిపల్ చైర్మన్ ఆనంద్ గౌడ్ సతీమణి ప్రసన్న, ఏకగ్రీవంగా ఎన్నికైన 58వ డివిజన్ అభ్యర్థి బి.రమాదేవి ఉన్నారు. ఇదిలా ఉండగా మైనార్టీల నుంచి కూడా మేయర్, లేదా డిప్యూటీ మేయర్ తమకే కావాలంటూ క్యాంపులో వాదన వినిపించినట్లు సమాచారం. ఆశావహుల్లో 39 వ డివిజన్ కార్పొరేటర్ గా గెలుపొందిన కాంగ్రెస్ సీనియర్ మైనార్టీ నాయకుడు సిరాజ్ ఖాద్రి సతీమణి హజీరా బేగం, 46వ డివిజన్ కార్పొరేటర్ అభ్యర్థిగా గెలుపొందిన మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ షబ్బీర్ అహ్మద్ సతీమణి కన్నీస్ సుల్తానా కూడా ఉన్నట్లు సమాచారం. మైనార్టీల వాదన తెరమీదకి రావడంతో మళ్లీ పార్టీ ఇరుకున పడే ఇబ్బంది ఏర్పడింది.

### డిప్యూటీ మేయర్ ఎమ్మెస్సార్..?

మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం కంటే ముందు నుంచి కూడా రిజర్వేషన్ రాకముందే మేయర్ అభ్యర్థి మారేపల్లి సురేందర్ రెడ్డి (ఎమ్మెస్సార్) అంటూ పట్టణంలో పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. హన్వాడ మండలంలో అన్ని తానై పార్టీని నడిపించి, అసెంబ్లీ ఎన్నికల్లో తన సత్తా చాటి ఎమ్మెల్యే శ్రీనివాస్ రెడ్డి గెలుపులోనే కాదు గ్రామపంచాయతీ ఎన్నికల్లోను కీలకపాత్ర పోషించారు. ఎమ్మెస్సార్ ఉంటే గెలుపు ఉన్నట్లే అనే స్థాయిలో మహబూబ్‌నగర్ నియోజకవర్గంలోని తనకంటూ ఒక ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు. నేర్పటం ఎమ్మెసార్‌కే అంటూ పెద్ద ఎత్తున ప్రచారం జరగిన రిజర్వేషన్ మార్పుతో భంగపాటు తప్పలేదు. దీంతో ఇక డిప్యూటీ మేయర్ ఆయనకే అంటూ ప్రచారం జరిగిన నేపథ్యంలో బండమీదిపల్లి 11వ డివిజన్ నుంచి కార్పొరేట్ అభ్యర్థిగా నిలబడి ఇటు సొంత పార్టీ నుంచి తన ఎదుగుదలను చూసి ఓర్వలేకున్నా, అటు ప్రధాన ప్రతిపక్ష పార్టీ సైతం తన మీద ఎన్ని నిందలు అబండాలు వేసిన ఆయన వ్యక్తిత్వం తెలిసిన బండమీదిపల్లి ప్రజలు ఎమ్మెస్సార్‌కే పట్టం కట్టారు. అయితే ఇప్పుడు మైనార్టీలు తెర మీదికి రావడంతో వాళ్లను ఎక్కడా సర్దుబాటు చేస్తారు అనేది అధికార పార్టీకి తలనొప్పిగా మారింది. మహబూబ్నగర్ కార్పొరేషన్ మేయర్ అభ్యర్థి ఎంపికలో పార్టీ అధిష్టానం జోక్యం చేసుకున్నట్లు సమాచారం. సీల్డ్ కవర్ లో మేయర్, డిప్యూటీ మేయర్ అభ్యర్థుల పేర్లు ఉండనున్నాయా అంటే ఇందులోను నిజం లేకపోలేదని కొందరు నిపుణులు అంటున్నారు. ఎవరు మేయర్, ఎవరు డిప్యూటీ మేయర్ తెలియాలంటే మరికొన్ని గంటలు వేచి చూడాల్సిందే.

# వచ్చేది మన ప్రభుత్వమే..

**సిద్దిపేట, సిరిసిల్లకు పోటీగా మహబూబ్‌నగర్ అభివృద్ధి వచ్చే ప్రభుత్వంలో శ్రీనివాస్‌గౌడ్‌కు మంచి స్థానం**

**ఆయనకు మీరంతా అండగా నిలవాలి**

**మహబూబ్‌నగర్ కార్పొరేటర్లతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

**మహబూబ్‌నగర్ బ్యూరో, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** మళ్ళీ వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, రాష్ట్రవ్యాప్తంగా పర్యటిస్తున్న సమయంలో ప్రజలే ఈ విషయం చెప్తున్నారని మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మహబూబ్ నగర్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో విజయం సాధించిన భారత రాష్ట్ర సమితి కార్పొరేటర్లు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో హైదరాబాద్ లో మర్యాదపూర్వకంగా కలవడం జరిగింది. ఈ సందర్భంగా కేటీఆర్ గెలుపొందిన పార్టీ కార్పొరేటర్లకు అభినందనలు తెలిపారు. ఎటువంటి ప్రలోభాలకు లొంగకుండా ప్రజా సమస్యలపై పాలక పక్షాన్ని నిలదీయాలన్నారు. రెండు ఏండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం వస్తుందని, ఎన్నికల సమయంలో డివిజన్‌లలో ఇచ్చిన హామీలను పూర్తి చేసేందుకు సహకారం అందిస్తామన్నారు. సిరిసిల్ల..సిద్దిపేటకు పోటీగా మహబూబ్ నగర్ ను శ్రీనివాస్ గౌడ్ అభివృద్ధి చేసారని గుర్తు చేశారు. మిగిలిన పనులను ప్రభుత్వం వచ్చిన వెంటనే పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. వచ్చే ప్రభుత్వం లో శ్రీనివాస్ గౌడ్ మంచి స్థానంలో ఉంటారని, మీ గెలుపు కోసం ఆయన అహర్నిశలు కృషి చేశారని, శ్రీనివాస్ గౌడ్‌కి అండగా మీరు నిలబడాలని కోరారు. తక్కువ ఓట్లతో చాలా మంది కార్పొరేట్ అభ్యర్థులు ఓడిపోయారు ఓడిపోయిన అభ్యర్థులకు భవిష్యత్‌లో పార్టీ మంచి స్థానం కల్పిస్తుందని భరోసాను ఇచ్చారు.



మహబూబ్‌నగర్ కార్పొరేటర్లతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# హంగుపై ప్రధాన పార్టీల అస్త్రాలు..

**బల్దియాలో నేడు**

**కొలువు దీరనున్న కొత్త పాలకులు**

**చైర్మన్ పీఠాన్ని దక్కించుకునేందుకు బేరసారాలు**

**కీలకంగా మారిన స్వతంత్ర అభ్యర్థులు**

**సరి సంఖ్య దక్కించుకొని ప్రధాన పార్టీలు.**

**ఎక్సు అఫిషియో ఓట్ల పై**

**ఆధారపడ్డ గద్వాల్ చైర్మన్ పీఠం...?**

**బిఆర్‌యస్, బీజేపీల పొత్తు కుదురేన...**




గద్వాల ఫిబ్రవరి 15, ప్రభాత వార్త: గద్వాల మున్సిపల్ చైర్మన్ పీఠం పై ఏ ప్రధాన పార్టీ కొలువు దీరనుందో అని గద్వాల ప్రజల మనస్సుల్లో ఆశక్తిగా మారింది. నేడు బల్దియాలో కొత్త పాలకులు కొలుదీరనున్న నేపథ్యంలో గద్వాలలో ప్రస్తుతం అదే హాట్ టాపిక్ గా మారింది. ఎక్కడ పది మంది గుమి కూడిన ఇదే టాపిక్. హంగు ఏర్పడడంతో చైర్మెన్ పీఠాన్ని మేము అంటే మేము అని ప్రధాన పార్టీలు పోటీపడుతున్నాయి. చైర్మెన్ పదవి దక్కించుకునేందుకు ఏ పార్టీకి సరి సంఖ్య దక్కలేదు. దీంతో ఎన్నికల ఫలితాలు వెలువడిన వెంటనే ఎవరి పార్టీ కౌన్సిలర్లను వారు ముందు జాగ్రత్తగా రహస్య స్థావరాలకు తరలించారు. మేము అంటే మేము అని బేరసారాలకు తెరలేపారు. దీంతో స్వతంత్ర అభ్యర్థులు కీలకంగా మారడంతో డిమాండ్ పెరిగిందనీ సమాచారం. కాంగ్రెస్ 16, బిఆర్ యస్ 11, బీజేపీ 7, స్వంత్రులు 2, ఏం ఐ ఎం 1, స్థానాలు గెలుపొందగా కాంగ్రెస్ పార్టీ స్వాతంత్ర్య అభ్యర్థులను కూడా గట్టుకుని, ఎం ఐ ఎం అభ్యర్థిని కూడా గట్టుకునే ప్రయత్నంలో వుండగా ఏం ఐ ఎం అధిష్టానం విప్ జారీ చేసినట్లు సమాచారం. దీంతో కాంగ్రెస్ కు 18 స్థానాల బలంతో వుంది. చైర్మెన్ పీఠాన్ని దక్కించుకునేందుకు 19 స్థానాలు కావాల్సి వుండగా, కాంగ్రెస్ 18 స్థానాలలో ఉండి, ఎక్స్ ఆఫీసియో ఓట్ల బలంతో చైర్మెన్ పీఠాన్ని దక్కించుకునేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తుంది. అదే పనిగా బిఆర్ యస్, బీజేపీ లు ఒక్కటై చైర్మన్ పదవి దక్కించుకోవాలని సన్నాహాలు చేస్తుంది. దీనికి ఆయా పార్టీల అగ్ర నేతలతో మంతనాలు కొనసాగుతున్నాయి. వీరి పొత్తు కుదిరితే బిఆర్ యస్ 11, బీజేపీ 7 కలిస్తే 18 స్థానాలతో బలం చేకూరుతుంది. వీరికి కూడా ఎక్స్ ఆఫీసియో ఓట్లు కీలకంగా మారాయి. ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఎక్స్ ఆఫీసియో ఓట్లున్న వారు వారి పార్టీ ఆదేశాల మేరకు ఓట్లు వేయాల్సి వుంటుంది. దీన్నే విప్ జారీ అంటారు. ఆయా పార్టీలు జారీచేసే విప్ ఆదేశాల మేరకు ఎవరు ఎవరికి ఓటు వేస్తారు అన్నది చూడాల్సి వుంది. గద్వాల నియోజక వర్గ ఎమ్మెల్యే బిఆర్ యస్ పార్టీ నుండి గెలుపొందారు కాబట్టి విప్ ఆదేశాల మేరకు గద్వాల మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ నుండి గెలుపొందిన కౌన్సిలర్ అభ్యర్థులకు మద్దతుగా ఓటు వేసేందుకు ఇక్కడి నియోజక వర్గ ఎమ్మెల్యేకు వుండదు. దీనిని ఎమ్మెల్యే పాటిస్తారా, నిబంధనలను ఉల్లంఘిస్తారా అన్నది ప్రశ్నార్థకంగా మారింది. ఎంపీ ఓటు కాంగ్రెస్‌కు వేసిన 19స్థానాలకు చేరుకుంటుంది. ఎమ్మెల్యే ఓటు చెల్లుబాటు అయితే 20కి చేరుకుంటుంది. అదేవిదంగా బిఆర్ యస్‌కు 2, బీజేపీకి ఒకటి ఎమ్మెల్సీ ఓట్లు ఉన్నాయి. పొత్తులో భాగంగా ముగ్గురు ఎమ్మెల్సీ లు 3 ఓట్లు బిఆర్ యస్, బీజేపీలకు వేస్తే 18 ప్లస్ 3,ఈపొత్తుతో 21 స్థానాలకు చేరుతుంది. ఎవరు ఎవరికి ప్రాధాన్య తనిస్తారు అన్నది చూడాల్సి వుంది.రాష్ట్ర రాజధానిలో వేడెక్కిన గద్వాల క్యాంపు రాజకీయాలు... గద్వాల మున్సిపల్ ఎన్నికల ఫలితాల్లో ఏ ఒక్క పార్టీకి స్పష్టమైన మెజార్టీ -మిగతా3లో..

# అక్షరాస్యతతోనే సామాజిక రుగ్మతలకు చెక్

**- మానవ ప్రగతికి మూలం సైన్స్**

**- సైన్స్ లేనిది జీవితం లేదు**

**- ఆల్ ఇండియా జాతీయ కార్యదర్శి ఆశా మిశ్రా**

**నాగర్‌కర్నూల్ ప్రతినిధి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** ప్రస్తుత సమాజంలో మానవ మనుగడకు, ప్రగతికి మూలం సైన్స్ అని, సైన్స్ లేనిది జీవితం లేదని ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్వర్క్ జాతీయ కార్యదర్శి ఆశా మిశ్రా అన్నారు. పట్టణంలోని టీటీడీ కళ్యాణ మండపం దాసరి నరేందర్ ప్రాంగణంలో జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ఐదవ వార్షిక ముగింపు సమావేశానికి ఆల్ ఇండియా పీపుల్స్ సైన్స్ నెట్వర్క్ జాతీయ కార్యదర్శి ఆశా మిశ్రా ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. సైన్సు పెరగాలంటే శాస్త్రీయ ఆలోచన విధానం కలిగి ఉండాలన్నారు. సాంకేతిక అభివృద్ధికి సైన్స్ కారణం. కానీ ప్రజలను మూఢనమ్మకాల ఆలోచనలో ఉంచడానికి కార్పొరేట్ శక్తులు ప్రయత్నిస్తున్నాయని, వారు మాత్రం ఆ సాంకేతిక అభివృద్ధిని తమ దోపిడీ కోసం ఉపయోగించుకుంటున్నారని ఆశ మిశ్రా అన్నారు. పెరిగిన సాంకేతిక అభివృద్ధిని ఉపయోగించుకుంటూ పర్యావరణానికి విఘాతం కలిగించే చర్యలు చేపడుతూ మానవ మనుగడకు ప్రమాదం వాటిల్లే పరిస్థితి తెస్తున్నారన్నారు. ప్రస్తుత మానవ తరాలకు భవిష్యత్తు మానవ తరాలకు ఆటంకం కలిగించే చర్య ఏదైనా అది అభివృద్ధి కాదన్నారు. రిటైర్డ్ ఐఎఎస్ ఆఫీసర్, జిహెచ్ఎంసి మాజీ కమిషనర్ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ సమావేశాలను నిర్వహిస్తూమేధావుల జ్ఞానాన్ని సేకరించి ఆ జ్ఞానాన్ని ప్రజలకు పంచుతూ చైతన్యం చేయడంలో జన విజ్ఞాన వేదిక చేస్తున్న కృషి అభినందనీయం అన్నారు. పర్యావరణానికి ప్రజలకు ఇబ్బందిని కలిగించే ఆనే కలిగించే ప్లాస్టిక్ వినియోగం అధికమైందన్నారు. దాని ద్వారా ఇండియాలో కష్టపడి సంపాదించిన సొమ్ములో 20 శాతం వైద్యం కోసం ఖర్చు చేస్తున్నారని అన్నారు. సామాజిక బాధ్యత కలిగిన వాలంటీర్లు కనుమరుగవుతున్నారు ప్రతి ఒక్కరు సామాజిక బాధ్యత వహించాలని సూచించారు. మూఢ నమ్మకాల నిర్మూలన కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి అన్నారు. సమాజంలో అక్షరాస్యత పెంపొందితేనే సామాజిక రుగ్మతలను పూర్తిగా రూపుమాపవచ్చని రాష్ట్ర జన విజ్ఞాన వేదిక నాయకుడు ఆమె పేర్కొన్నారు. నేటి సమాజంలో అక్షరాస్యత లోపం కారణంగా గ్రామీణ ప్రాంతాల్లో ఇంకా మూఢనమ్మకాలు, అంధ విశ్వాసాలు ప్రబలంగా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. శాస్త్రీయ దృక్పథం లేకపోవడం వల్ల ప్రజలు అనారోగ్య సమస్యలు, సామాజిక వివక్ష, కులమత భేదాలు, బాల్యవివాహాలు, మద్యం దుర్వినియోగం వంటి సమస్యలకు గురవుతున్నారని పేర్కొన్నారు. అక్షరాస్యతతో పాటు శాస్త్రీయ అవగాహన పెరిగితేనే సమాజంలో చైతన్యం పెంపొందుతుందని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో వివిధ జిల్లాల నుంచి జనవిజ్ఞాన వేదిక ప్రతినిధులు, బి.ఎన్.రెడ్డి, రామచంద్రయ్య, వెంకటేశ్వరరావు, చంద్రశేఖర్, రామకృష్ణ, బలరాం, గోపాల్, దశరథం బాబురావు లక్ష్మణ్‌లు ఉన్నారు.




సమావేశంలో మాట్లాడుతున్న ఆల్ ఇండియా జాతీయ కార్యదర్శి ఆశా మిశ్రా

# కనుల పండుగ కళ్యాణోత్సవం

**భ్రమరాంబ మల్లికార్జున స్వామి కళ్యాణంలో**

**ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు, ఎంపీ మల్లురవి**



స్వామివారి కళ్యాణంలో పాల్గొన్న ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు, ఎంపీ మల్లురవి

**అచ్చంపేట (లింగాల), ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం, గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో అమ్రాబాద్ నల్లమల అటవీ ప్రాంతంలోని బౌరాపూర్ లో నిర్వహించే శ్రీశ్రీశ్రీ భ్రమరాంబ మల్లికార్జున స్వామి వారి కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. డీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవి, సీబీఎం ట్రస్ట్ చైర్ పర్సన్ డా. అనురాధ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నల్లమల అటవీ ప్రాంతంలోని ఆలయాలు ఆధ్యాత్మికంగా మాత్రమే కాక పర్యాటకపరంగా కూడా ఎంతో ప్రాధాన్యత కలిగివున్నాయని తెలిపారు. భౌరాపూర్ చెంచు పెంటలోని ఈ దేవస్థానాన్ని అభివృద్ధి చేసి భక్తులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడం అత్యవసరమని పేర్కొన్నారు. గిరిజన ప్రాంతాల ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షిస్తూ పర్యాటక -మిగతా3లో..

# భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక లాంఛనమే

- **మున్సిపల్ చైర్మన్‌గా ఏకగ్రీవం కానున్న బాలకోటి ముడావత్, లిక్కి సూర్యకళ?**
- **నేడు భూత్పూర్ మున్సిపల్ చైర్మన్,వైస్ చైర్మన్‌ల ఎన్నిక**



బాలకోటి ముడావత్



లిక్కి సూర్యకళ

**భూత్పూర్,ఫిబ్రవరి 15,ప్రభాతవార్త :** ఏడు స్థానాలు కైవసం చేసుకున్న అధికార పార్టీ కాంగ్రెస్ భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ స్థానాన్ని చేపట్టనుంది.ముందుగానే ప్రకటించినట్లుగా ఎనిమిదోవార్డు నుంచి కౌన్సిలర్‌గా విజయం సాధించిన బాలకోటి ముడావత్ భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్నిక లాంఛనమే కానుంది.భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ పదవీని ఎస్టీ జనరల్‌కు కేటాయించడంతో బాలకోటిని చైర్మన్‌గా ముందస్తుగానే ప్రకటించారు.ఎమ్మెల్యే జీఎంఆర్‌చే చైర్మన్‌గా ప్రకటింపబడిన బాలకోటిని కాంగ్రెస్ కౌన్సిలర్లు ఆరుగురు నేడు(సోమవారం)ఏకగ్రీవంగా ఎన్నుకోనున్నారు.ముడావత్ బాలకోటి మున్సిపాలిటీ కౌన్సిల్‌కు కొత్తేమికాదు.ఇదివరకు బీఆర్ఎస్ కౌన్సిలర్‌గా ఐదేళ్లు భూత్పూర్ మున్సిపాలిటీలో పనిచేసిన అనుభవముంది.ఇదే అనుభవం,ఆయన ఆర్థిక పరిపుష్టి,అందరితో కలుపుకోరుతనం బాలకోటి వద్ద పుష్కళంగా ఉండడంతో బాలకోటి మిగిలిన అందరు కౌన్సిలర్ల సమన్వయంతో చైర్మన్‌గా రాణిస్తాడన్న భావన భూత్పూర్ మున్సిపాలిటీలోని పలువురు రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు.చైర్మన్‌గా బాలకోటి ముడావత్ ఎన్నిక లాంఛనమే అవుతుంది.ఇక వైస్ చైర్మన్ పదవీ అంశంలో ప్రధానంగా పదోవార్డు నుంచి కౌన్సిలర్‌గా రెండోసారి కౌన్సిల్‌లో అడుగిడుతున్న లిక్కి సూర్యకళ పేరు వినవస్తోంది.ఇందుకు ఎన్నికైన నూతనంగా ఎన్నికైన అందరు కౌన్సిలర్లు ఆమోదం తెలిపినట్లు తెలిసింది.ఇందులో కొంత లాజిక్ కూడా దాగిఉంది.1,5,8వార్డుల నుంచి ఎన్నికైన అధికార పార్టీ కాంగ్రెస్ కౌన్సిలర్లలో ఒకరు అధ్యక్ష స్థానం లభిస్తుండగా 2,3,9,10వార్డుల నుంచి కౌన్సిలర్లుగా ఎన్నికైన అధికార పార్టీ కాంగ్రెస్ నుంచి వైస్ చైర్మన్‌గా ఎన్నుకోవాల్సి ఉంది.వాస్తవానికి భూత్పూర్ ప్రాంతంలోని నాలుగు (2,3,9.10)వార్డుల నుంచి ఎన్నికైన కౌన్సిలర్లలో ఎవరో ఒకరికి చైర్మన్ పదవీ దక్కాల్సిఉంది.కానీ ముందుగానే ఎమ్మెల్యే జీఎంఆర్‌తో పాటు పార్టీ మండల,పట్టణ అధ్యక్షులు లిక్కి,కేసిరెడ్డిలు కూడా బాలకోటి చైర్మన్ అభ్యర్థిత్వాన్ని ఆమోదం తెల్పడంతో బాలకోటి ముడావత్ చైర్మన్ ఎన్నిక లాంఛనమే అవుతుంది.బాలకోటి ముడావత్ సోమవారం భూత్పూర్ మున్సిపల్ చైర్మన్ పదవీని చేపట్టనున్నారు.వైస్ చైర్మన్ పదవీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు లిక్కి నవీన్‌గౌడ్ మాతృమూర్తి లిక్కి సూర్యకళకు దక్కనుందని పలువురు భావిస్తున్నారు.

# విప్లవ చైతన్య మూర్తి సంత్ సేవాలాల్ మహారాజ్

**దేశం గర్వించదగ్గ గొప్ప సంఘసేవకుడు , ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి**

**బిజినేపల్లి,ఫిబ్రవరి15 ప్రభాతవార్త:** బంజారా జాతిని చీకటి నుంచి వెలుగులోకి తీసుకొచ్చిన ఒక విప్లవ చైతన్య మూర్తి సంత్ సేవాలాల్ మహారాజ్ అని ఎమ్మెల్యే కూచుకుల్ల రాజేష్ రెడ్డి అన్నారు. గంగారం పెద్ద తండా లో సంత్ సేవాలాల్ ,మెరమ్మయాడి నూతన ఆలయాల వద్ద పూజా కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి మాట్లాడుతూబంజారా, లంబాడాల ఆరాధ్య దైవం, సంత్ సేవాలాల్ మహారాజ్ దేశం గర్వించదగ్గ గొప్ప ఆధ్యాత్మికవేత్త, సంఘసేవకుడు అని కొనియాడారు.అడవి బిడ్డల ప్రత్యేకమైన ప్రకృతి ఆరాధన, ఆధ్యాత్మిక దృక్పథం, సామాజిక సాంస్కృతిక జీవన విధానాన్ని కాపాడటానికి సేవాలాల్ మహారాజ్ చేసిన కృషి గొప్పదని వెల్లడించారు. తన ప్రజలను బయటి సమాజం నుంచి అనుక్షణం రక్షి ంచుకొనే దిశగా సంత్ సేవాలాల్ జీవితాంతం పోరాటం సాగించారని పేర్కొన్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్, క్రమశిక్షణ కలిగిన ఒక బాలజ్ఞానిగా, బంజారా జాతి కులదైవంగా భావించే సాత్ భవానీ ఏడుగురు దేవతలలో ఒకరైన మెరమ్మయాడి కి భక్తి భావం కలిగినవాడిగా, పశువులను కాసే ఓ సాధారణ లంబాడీ తల్లి బిడ్డగా పెరిగాడు అని చెప్పారు.18వ శతాబ్దంలో సంభవించిన ఓ కరువుతో దిక్కుతోచని పరిస్థితుల్లో ఉన్న బంజారా జాతికి ధైర్యం, భరోసానిచ్చి, భవిష్యత్తుకు బాటన వ్యకి సేవాలాల్ మహారాజ్, బంజారా జాతిలో ప్రధానంగా ఉన్న మూఢ నమ్మకాలను ఆయన రూపుమాపాడని తెలిపారు. లంబాడా వర్గాలకు రాష్ట్ర ప్రభుత్వం అనేక అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు చేపట్టి ముందుకు సాగుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ రాత్లావత్ గోపాల్ నాయక్, రాష్ట్ర నాయకులు సుహాసన్ రెడ్డి , కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు మిద్దెరాములు, గిరిజన నాయకులు మాన్య నాయక్,గోవింద్ నాయక్, రామచందర్, పాండు, గోపాల్, హరీష్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, పీ హాలియా, మల్లేష్, రవి, చంద్రు, దేవుల, బద్య, దీప్లా, ఆయా తండాల గిరిజనులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న గిరిజనులు

## బీరప్ప ఆలయ నిర్మాణానికి విరాళం

**నవాబుపేట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** యాదవ కురుమల ఆరాధ్య దైవమైన బీరప్ప ఆలయ నిర్మాణానికి యువకులు తమ వంతు సహాయంగా లక్ష రూపాయల విరాళం అందించారు. మండల పరిధిలోని కుచూరు గ్రామంలో నూతనంగా నిర్మిస్తున్న బీరప్ప ఆలయ నిర్మాణానికి గ్రామ కురుమ యువకులు, గడ్డం మల్లేష్ ఇండియన్ ఆర్మీ రూ.20 వేల రూపాయలు, పరమటి రఘువేందర్ ఇండియన్ ఆర్మీ రూ. 20వేలు పర్మటి గోపాల్ రూ. 20 వేలు గడ్డం రఘు రూ. 10 వేలు చిట్టి మహేష్ రూ. 10వేలు గడ్డం రమేష్ రూ.10 వేలు చిట్టే శ్రీశైలం రూ. 10వేలు, విరాళం ఆలయ నిర్మాణ కమిటీ సభ్యుల సమక్షంలో ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు గడ్డం శంకర్ చిట్టె రాజు కు అందజేయడం జరిగింది. వచ్చే సంవత్సరం వరకు ఆలయ నిర్మాణం పూర్తి చేసి అంగరంగ వైభవంగా బీరప్ప గుడి పూజలు మహోత్సవం జరుపుతామని ఆలయ కమిటీ సభ్యులు గ్రామస్తులు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో బీరప్పాలయ నిర్మాణ కమిటీ సభ్యులు గడ్డంశంకర్,పరమటి వెంకటయ్య చిట్టి రాజు బోయినర్ మల్లయ్య చిట్టె యాదయ్య గంజికుంట మల్లయ్య, చిట్టె ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.


ఆలయానికి విరాళం అందజేస్తున్న దృశ్యం

## ప్రత్యేక పూజల్లో రాజశేఖర్ గౌడ్

**కొల్లాపూర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** కొల్లాపూర్ మున్సిపాలిటీ 13వ వార్డు చౌటబెట్ల కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా పోటీ చేసి అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన సందర్భంగా మహాశివరాత్రిని పురస్కరించుకుని ఆదివారం మున్సిపల్ 13వ వార్డు కౌన్సిలర్ వంగ అనూష రాజశేఖర్ గౌడ్ సోమశిల శ్రీలలితా సోమేశ్వర స్వామి దేవాలయంలో అధికారికంగా సింగోటం శ్రీలక్ష్మి నరసింహ స్వామి ఆలయంలో స్వామి వార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ పరమేశ్వరుడి , శ్రీలక్ష్మి నరసింహ స్వామి అనుగ్రహంతో వచ్చిన ఈవిజయం ప్రజలకు అంకితమని,రాష్ట్ర మంత్రివర్యులు జూపల్లి కృష్ణారావు పూర్తి సహయసహకారాలతో చౌటబెట్ల గ్రామానికి పట్టణంలోనే ఆదర్శ వార్డుగా మొదటి స్థానంలో నిలుపుతామని ఈ సందర్భంగా తెలిపారు. అంతకు ముందు ఆలయ కమిటీ సభ్యులు వారిని స్వాగతం చి శాలువాతో సత్కరించి సన్మానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.


ప్రత్యేక పూజలో కౌన్సిలర్ వంగ అనూష రాజశేఖర్ గౌడ్

## ఘనంగా వీరబ్రహ్మేంద్ర స్వామి గోవింద మాంబ కళ్యాణోత్సవం

**వెల్దండ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:**వెల్దండ మండల కేంద్రంలోని బ్రహ్మగిరి దేవాలయంలో శ్రీ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి గోవిందమాంబల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా కనుల పండవగా అర్చకులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యెన్నం భూపతి రెడ్డి, సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ్ యాదవ్, గ్రామ సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, డాక్టర్ హరికాంత్ రెడ్డి, వై కృష్ణారెడ్డి, విశ్వబ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షులు అన్నదానం కృష్ణయ్య చారి, రాజయ్య పద్మయ్య, ఉప సర్పంచ్ శ్రీను ముదిరాజ్, వార్డు సభ్యులు పురుషోత్తం చారి, రమేష్, కృష్ణ ముదిరాజ్, పుల్లయ్య, శ్రీనివాస్, విశ్వబ్రాహ్మణ నాయకులు అంజయ్య చారి, పాండు చారి, రామాచారి, శ్రీశైలంచారి, వెంకటాచారితో పాటు తదితరులు ఉన్నారు.


కళ్యాణోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

## ఘనంగా శివపార్వతుల కళ్యాణం

**అయిజ ఫిబ్రవరి 13, ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలం కేంద్రంతో పాటు మండల పరిధిలోని ఆయా గ్రామాలలోని శివాలయాల్లో శివపార్వతుల కళ్యాణోత్సవం ఘనంగా నిర్వహించారు ఇందులో భాగంగా పట్టణ కేంద్రంలో వెలసిన గుంతమిట్ట రామలింగేశ్వర స్వామి దేవాలయంలో మహాశివరాత్రి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా స్వామి వారికి అభిషేకం నిర్వహించి అనంతరం నందికోల్ సేవా కార్యక్రమాలు నిర్వహించారు అలాగే స్వామి వారి దర్శనానికి పట్టణ ప్రజలు విశేషంగా తరలివచ్చి పూజలు నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని సింధనూరు బింగి దొడ్డి పులికల్ తదితర గ్రామాల్లోని శివాలయాల్లో శివపార్వతుల కళ్యాణం నిర్వహించారు.


నందికోల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

## ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరిన కౌన్సిలర్

**వెల్దండ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:**ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికలలో కల్వకుర్తి 8వ వార్డులో స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన లలిత గణేష్ గెలుపొందారు. ఆదివారం వెల్దండ మండల కేంద్రంలో మాజీ సర్పంచ్ యెన్నం భూపతిరెడ్డి నివాసంలో ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి లలితా గణేష్‌ను కాంగ్రెస్ పార్టీలోకి సాధారణంగా ఆహ్వానించి పార్టీ కండువా కప్పి వారిని అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అభివృద్ధి సాధించాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని సీఎం రేవంత్ రెడ్డిని ఒప్పించి నియోజకవర్గానికి అత్యధిక నిధులు తీసుకువస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ్ యాదవ్, మాజీ సర్పంచ్ బృంగి ఆనంద్‌కుమార్, కౌన్సిలర్ షాన్‌వాజ్‌ఖాన్, సర్పంచ్ మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, నాయకులు అలీతో పాటు తదితరులు ఉన్నారు.


ఎమ్మెల్యే సమక్షంలో పార్టీలో చేరిన కౌన్సిలర్ లలిత గణేష్

## ఘనంగా శివరాత్రి పర్వదిన వేడుకలు

**వెల్దండ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:**వెల్దండ మండలంలో అన్ని గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో శివరాత్రి పర్వదిన వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా ప్రజలు భక్తిశ్రద్ధలతో ఉపవాస దీక్షలు ఉండి శివయ్య నామస్మరణతో మునిగిపోయారు. వెల్దండ మండలంలోని గుండాల అంబ రామలింగేశ్వర స్వామి దేవాలయానికి ఆదివారం తెల్లవారుజాము నుండే శివయ్య దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున పోటెత్తారు. శివయ్యను దర్శించుకుని తమ మొక్కలను చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారి దర్శనానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి దేవాలయానికి విచ్చేయగా దేవాలయ చైర్మన్ మల్లెపల్లి సందీప్ రెడ్డి ఆధ్వర్యంలో దేవాదాయ శాఖ ఆలయ అర్చకులు ఎమ్మెల్యేకు పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి వారి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు ఎమ్మెల్యేను శాలువాలతో సన్మానించి ఆశీర్వదించి తీర్థ ప్రసాదాలను అందంచారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ యెన్నం భూపతి రెడ్డి, సురేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ ఉమా సంజీవ యాదవ్, మండల పార్టీ అధ్యక్షులు మోతిలాల్ నాయక్, కిసాన్ సెల్ అధ్యక్షులు పర్వత్ రెడ్డి, ఈవో ప్రసాద్, సర్పంచులు శిరీష వెంకటయ్య, మట్ట యాదమ్మ వెంకటయ్య గౌడ్, జక్కుల చిన్న జంగయ్య యాదవ్, మార్కెట్ డైరెక్టర్ ఉప సర్పంచ్ శ్రీను ముదిరాజ్, శంకర్ నాయక్, పురుషోత్తం చారి, పుల్లయ్య, అంజయ్య, దేవాలయ కమిటీ సభ్యులు, సిబ్బంది ఆలయ అర్చకులు తో పాటు తదితరులు ఉన్నారు.


ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

# మారు మ్రోగిన శివనామస్మరణ

## శైవాలయాలలో భక్తుల కిటకిట

**చిన్న చింతకుంట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలంలోని చిన్న వడ్డెమాన్ సమీపంలో వెలసిన స్వయంభు శ్రీ రామలింగేశ్వర దేవాలయానికి భక్తులు భారీగా తరలివచ్చారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి చిన్నారులతో పాటు మహిళా భక్తులు, యువకులు పెద్ద ఎత్తున స్వామివారిని దర్శించుకుని బారులుతీరి మొక్కులు చెల్లించుకున్నారు. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు శ్రీ రామలింగేశ్వర శివలింగానికి నిత్యాభిషేకాలు అర్చకులు నిర్వహించారు. రాత్రికి లింగోద్భవకాలంలో స్వామివారికి మహా రుద్రాభిషేకం పూజలను అర్చకులు నిర్వహించారు. లింగోద్భవ కాలంలో స్వామివారికి అభిషేకం నిర్వహిస్తే సకల పాపాలు తొలుగుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. యువతీ యువకులు మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఉపవాస దీక్షలు చేపట్టి భక్తి మార్గంలో ఉంటూ సోమవారం తమ ఇష్టదైవాలకు నైవేద్యం సమర్పించి ఉపవాస దీక్షలను విరమిస్తారు. ఉపవాస దీక్షలు చేపట్టడం వల్ల మంచి జరుగుతుందని భక్తుల విశ్వాసం. మండలంలోని ఆయా గ్రామాలలో స్థానిక శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. మహాశివరాత్రి సందర్భంగా పల్లెలు శివనామస్మరణతో మారుమ్రోగాయి.

**ఘనంగా మహాశివరాత్రి వేడుకలు..**

**ఆత్మకూర్ ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** మున్సిపల్ కేంద్రమైన ఆత్మకూరు పట్టణంలోని బాల పరమేశ్వర స్వామి దేవాలయం మండల పరిధిలోని మూలమల్ల గ్రామంలో గల పాండురంగ స్వామి దేవాలయంలో ఆదివారం రోజు మహాశివరాత్రి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఆదివారం తెల్లవారుజాము నుండి శివ భక్తులు దేవాలయాలకు చేరుకొని భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. మూలమల్ల గ్రామంలో గల పాండురంగ స్వామి దేవాలయంలో ప్రధాన అర్చకులు శ్రీధర్ జోషి ఆధ్వర్యంలో శివ భక్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించడమే కాకుండా మధ్యాహ్నం ప్రసాదా వితరణ స్వీకరించారు . ఈ కార్యక్రమంలో పాండురంగ స్వామి దేవాలయ అధ్యక్షులు నరసింహారెడ్డి తదితరులు పాల్గొనగా ఆత్మకూరు పట్టణంలోని బాల పరమేశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించడమే కాకుండా భక్తిశ్రద్ధలతో ముక్కులు తీర్చుకున్నారు.

**ఘనంగా మహా శివరాత్రి పర్వదినం**

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం మండలంలోని ఆయా గ్రామాల్లోని ఆలయాలలో భక్తులు, గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండల కేంద్రమైన ఉప్పునుంతల శ్రీ కేదారేశ్వర ఆలయం, శ్రీ చెన్నకేశవస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం సామూహిక వ్రతాలు నిర్వహించారు. భక్తులు వారి వారి ఇళ్లల్లో వేకువజామున స్థానాల ఆచరించి ఆలయాల వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు జరిపించారు. శుభరాత్రి జాగారణలు చేపట్టారు. ఉప్పునుంతల, వెల్టూరు, పెనిమెళ్ళ, మామిళ్ళపల్లి, తిప్పా పూర్ గ్రామాల్లో శివ పార్వతుల కళ్యాణం ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.


శ్రీ రామలింగేశ్వర స్వామిని దర్శించుకున్న భక్తులు

**ఉప్పరిపల్లిలో...**మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం మండలంలోని ఉప్పరిపల్లి గ్రామ శివారులో ఉన్న పురాతన ఆలయంలో గ్రామ సర్పంచ్ బొజ్జ గీత అమరేందర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకొని శివపార్వతులకు కళ్యాణం జరిపించారు. అనంతరం వారి సహకారంతో అన్నదాన కార్యక్రమం చేపట్టారు. గ్రామ శివారులో ఉన్న ఊర చెరువు సమీపంలో అతి పురాతనమైన ఆలయం ఉన్నప్పటికీ ఉత్సావాలు ఇప్పటివరకు జరగలేదు. గ్రామ సర్పంచ్ బొజ్జ గీతా అమరేందర్ రెడ్డి పురాతన ఆలయం చుట్టూ పేరుకుపోయిన ముళ్ల కంచే ను తొలగించి గ్రామం నుంచి ఆలయం వరకు రోడ్డు మార్గం ఏర్పాటు చేసి భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలవకుండా ఆలయ ప్రాంగణం చుట్టూ పరిశుభ్రంగా చేశారు. శివపార్వతుల కళ్యాణానికి గ్రామం నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

**అభిషేకాలు,అర్చనలతో కిటకిటలాడిన శివాలయాలు**

**- మహాశివరాత్రి సందర్భంగా శివాలయాలకు భక్తుల తాకిడి**

**- భూత్పూర్ శ్రీరామలింగేశ్వరాలయంలో భక్తుల కోలాహలం**

**భూత్పూర్,ఫిబ్రవరి 15,ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా ఆదివారం శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. లింగాభిషేకాలు,అర్చనలు,ఉపవాస దీక్షలు,ప్రత్యేక పూజలతో భక్తులు లింగస్వరూపుడైన పరమశివుని అభిషేకించి భక్తులు పరవశించారు. చిన్నా,పెద్దా,మహిళలు,భాలికలు,వయోవృద్ధులనే భేదం లేకుండా శివాలయాలకు శివుని దర్శనానికి క్యూ కట్టారు.ఎనిమిదేళ్ల చరిత్ర గల్గిన భూత్పూర్ శ్రీరామలింగేశ్వరాలయంలో భక్తుల తాకిడి బాగానే ఉంది.ఉదయం నుంచి సాయంత్రం వరకు పరమశివుని లింగాభిషేకం,లింగార్చన కోసం భక్తులు బారులు తీరి నిల్చున్నారు.మహాశివరాత్రిని పురస్కరించుకుని భూత్పూర్ రామలింగేశ్వరాలయంతో పాటు పొరుగు మండలం అడ్డాకుల మండలం కందూరు రామలింగేశ్వరాలయానికి,బాలానగర్ మండలం రామేశ్వరం ఆలయాలకు కూడా అశేషజనవాహినితో శివభక్తులు పరమశివుని అభిషేకించేందుకు తండోపతండాలు తరలివెళ్లారు.మహాశివరాత్రి సందర్భంగా భూత్పూర్ శ్రీరామలింగేశ్వరాయలంలో భక్తుల కోసం నిర్వహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. ద్వాదశ జ్యోతిర్లింగాలలో రెండోదైన శ్రీశైల మల్లిఖర్జునుడి దర్శనానికి శివరాత్రికి పక్షం రోజుల నుంచే భూత్పూర్ మీదుగా మహబూబ్‌నగర్ జిల్లా నలుమూలలు,కర్నాటక, మహారాష్ట్రాల నుంచి భక్తులు గడిచిన పక్షం రోజుల నుంచి పాదయాత్ర ద్వారా శ్రీశైలానికి తరలివెళ్లారు.పాదయాత్ర భక్తులు,శివస్వాములకు దారిపొడవునా శివభక్తులు,సంఘాల సభ్యులు అన్నదానాలేర్పాటు చేసి పరమేశ్వరుని పట్ల తమకున్న భక్తిప్రపత్తిని చాటారు..


ఉప్పునుంతల ఆలయంలో శివునికి అభిషేకం చేస్తున్న భక్తులు


ఉప్పరిపల్లి లో అన్నదాన కార్యక్రమం


శ్రీ శివపార్వతులను దర్శించుకుంటున్న భక్తులు


పాండురంగ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న భక్తులు


భూత్పూర్ శ్రీరామలింగేశ్వరాలయంలో
లింగాభిషేకం,అర్చన కోసం బారులు తీరిన శివభక్తులు


మహాశివరాత్రి సందర్భంగా సర్వాంగ
సుందరంగా అలంకరించిన భూత్పూర్ శ్రీరామలింగేశ్వరాయలయం


భక్తులతో కిటకిటలాడుతున్న భూత్పూర్ శ్రీరామలింగేశ్వర గర్భగుడి

# ఘనంగా సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతి

**చిన్నంబావి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** బంజారా తెగకు చెందిన గొప్ప ఆధ్యాత్మిక గురువు, సంఘ సంస్కర్త మరియు లంబాడాల ఆరాధ్య దైవం అయిన సంత్ సేవాలాలు జయంతిని చిన్నంబావి మండల కేంద్రంలో లంబాడి సంఘం నాయకులు గుర్నాథ్ జాదవ్, జితేందర్, మానప్ప ల ఆధ్వర్యంలో జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఫిబ్రవరి 15, 1739న కర్ణాటక,ఆంధ్రప్రదేశ్ సరిహద్దులో జన్మించిన సంతు సేవాలాల్ బంజారా సమాజంలో మూఢనమ్మకాలు, జంతు బలులను వ్యతిరేకించారని, ఆయన బోధనలు, సాంస్కృతిక వారసత్వం బంజారాల జీవన విధానానికి దిశానిర్దేశం చేస్తాయన్నారు. అందుకే ఆయన జయంతిని ప్రతి సంవత్సరం ఫిబ్రవరి 15న బంజారాలు ఘనంగా జరుపుకుంటారనీ అన్నారు. జంతు బలులను నిషేధించారు, మద్యపానానికి దూరంగా ఉండాలని బోధించారు, మహిళలకు గౌరవం ఇవ్వాలని, స్త్రీలను దేవతలుగా భావించాలని కోరారు.


సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న లంబాడా నాయకులు

బంజారాలకు హిందూ ధర్మం యొక్క గొప్పతనాన్ని, శాంతి మరియు ప్రేమ మార్గాన్ని చూపారు. తెలంగాణ ప్రభుత్వం ఫిబ్రవరి 15ను సంత్ సేవాలాల్ జయంతిగా అధికారికంగా గుర్తించి సెలవు దినంగా ప్రకటించిందనీ అన్నారు. అడవులను, పర్యావరణాన్ని, నీటిని సంరక్షించాలని, అందరితో సమానంగా వ్యవహరించాలని, సత్య మార్గంలో నడవాలని బోధించారు. ఆయనను, దేవుని అవతారంగా మరియు గిరిజనుల రక్షకుడిగా బంజారా ప్రజలు భావిస్తారు.సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని భారతదేశ వ్యాప్తంగా, ముఖ్యంగా తెలంగాణ, మహారాష్ట్ర, కర్ణాటక రాష్ట్రాల్లోని బంజారాలు పెద్ద ఎత్తున ర్యాలీలు, పూజా కార్యక్రమాలతో జరుపుకుంటారనీ అన్నారు.ఈ కార్యక్రమంలో గుర్నాథ్ జాదవ్, జితేందర్, మనప్ప, గుండప్ప, రామచంద్ర, పెరుమాళ్ళ తిరుపతి, మద్దూరు నాగరాజు, పెరుమాళ్ళ శ్రీనివాస్, ఎండి. అప్సర్ తదితరులు పాల్గొన్నారు.


సంత్ సేవాలాల్ జయంతి కార్యక్రమంలో పాల్గొన్న లంబాడా నాయకులు

# భక్తిశ్రద్ధలతో శివాంజనేయ స్వామి జాతర మహోత్సవాలు

## ప్రత్యేక పూజలో పాల్గొన్న సర్పంచ్ రవికిరణ్

**నవాబుపేట, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని మండలపరిధి లోని ఇప్పటూర్లో వెలసిన శ్రీ శివాంజనేయ స్వామివారి బ్రహ్మోత్సవాలు భక్తిశ్రద్ధలతో సాగుతున్నా యి. ఆదివారం శివపార్వతుల కళ్యాణం, పలు పూజా కార్యక్రమాల ల్లో సర్పంచ్ రవికిరణ్, ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో అట్టహాసంగా జరిగాయి. సర్పంచ్ దంపతులు ఇద్దరు స్వామివారికి ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు.సర్పంచ్ రవి కిరణ్ మాట్లాడు తూ సోమవారం రథోత్సవం, 17న శకటోత్సవం, 18న స్వామి వారికి అమృత స్నానాలు, ధ్వజారోహణాలతో శివాంజనేయ స్వామి వారి బ్రహ్మోత్సవాలు ముయ్యనున్నాయని ఈ సందర్భంగా తెలిపారు.ఉత్సవాల సందర్భంగా 16న సోమవారం నుండి మూడవ మండల స్థాయి వాలీబాల్ టోర్న మెంట్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమానికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని బ్రహ్మోత్సవాలను విజయవంతం చేయాలని తెలిపారు. కార్యక్రమంలో దేవస్థా న కమిటీ గౌరవ అధ్యక్షులు బొల్లవరం నరసింహారెడ్డి,


పూజలు నిర్వహించిన భక్తులు

దేవస్థాన చైర్మన్ కోడిగంటి మహేష్, వైస్ చైర్మన్ రవిగౌడ్, ప్రధాన కార్య దర్శి మంచాల నరసింహులు, సహా కార్యదర్శి పాశం చంద్రయ్య, కోశాధికారి మిద్దెల అభిలాష్, కార్యవర్గ సభ్యులు గోవు చెన్నయ్య, నర్సింగ్ రావు, సాయికిరణ్, గోవు పోశయ్య, ఆంజనేయులు గౌడ్, గోవు భీమయ్య, బ్యాగరి మాధవులు, తలారి గోపాల్, కోడిగంటి యాదయ్య, వడ్ల హరీష్ కొత్త నాగరాజు గ్రామస్తులు భక్తులు పాల్గొన్నారు.

## బి.సి మహిళకు మేయర్ ఇవ్వాలి

### బీసీ సమాజ్ డిమాండ్

**మహబూబ్‌నగర్,ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :**పాలమూరు మేయర్‌స్థానాన్ని బిసి మహిళ (హిందు)కు ఇవ్వాల్సిందే అని బీసీ సమాజ్ డిమాండ్ చేసింది. ఎన్నికలలో ఇచ్చిన హామీ ప్రకారం బిసి మహిళకు ఇవ్వాలని,తమకు అనుకూలంగా వుండే పేరును ప్రకటించి మేయర్ స్థానంలో కూర్చో బెట్టాలని చూస్తున్న వారికి తగిన గుణపాఠం చెప్తామని బీసీ సమాజ్ ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా కన్వీనర్ శ్రీనివాస్ సాగర్ డిమాండ్ చేశారు. బి.సి మహిళ (హిందు)కు కేటాయించడంతో బిసి లందరు ముక్కుమ్మడిగా అధికార పార్టీకి ఓటు వేసి గెలిపించారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకొని బీసీ మహిళ (హిందు) కు మహబూబ్‌నగర్ కార్పొరేషన్ తొలి మేయర్ గా అవకాశం కల్పించాలని బిసి సమాజ్ డిమాండ్ చేస్తుందని స్పష్టం చేశారు.

## ఎన్నికలలో ఇచ్చిన హామీ నిలబెట్టుకున్న సర్పంచ్ కుమార్ నాయక్


బోరు వేసేందుకు పూజ నిర్వహిస్తున్న సర్పంచ్

**బాలానగర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** బాలానగర్ మండల పరిధిలోని పోచమ్మ గడ్డ తండా నూతన సర్పంచ్ జటావత్ కుమార్ నాయక్ ఇటీవలే జరిగిన గ్రామపంచాయతీ ఎన్నికల్లో తాను ఇచ్చిన హామీ మేరకు తన పట్టా పొలంలో మూడు గుంటల భూమిని ఆంజనేయస్వామి, సేవాలాల్ మహారాజ్ ఆలయాల నిర్మాణానికి ఇస్తానని హామీ ఇచ్చారు. సేవాలాల్ మహారాజ్ జయంతి సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు దేవాలయాల నిర్మాణానికి భూమిని ఇచ్చి, నూతన బోర్ వేయించారు. ఎన్నికలలో ఇచ్చిన హామీ నెరవేర్చడంతో తండా వాసులు ఆనందం వ్యక్తం చేశారు.

## కల్వరాల గ్రామానికి సిసి రోడ్లకు నిధులు మంజూరు

**పనులు ప్రారంభించిన గ్రామ సర్పంచ్ కాంగ్రెస్ నాయకులు**



కల్వరల్ల గ్రామంలో సిసి రోడ్లు ప్రారంభించిన సర్పంచ్ బండారి రాముడు

**వీపనగండ్ల ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** వీపనగండ్ల మండల కల్వరాల గ్రామంలో తాగునీటి సమస్య పరిష్కరించడం కోసం మంత్రి జూపల్లి సహకారంతో 26 లక్షలు మంజూరు చేయించినట్లు ఆ గ్రామ సర్పంచ్ బండారి రాముడు గ్రామ కాంగ్రెస్ నాయకులు చక్ర వెంకటేష్ వెంకట రాజయ్య, తెలిపారు ఆదివారం నాడు వారు మాట్లాడుతూ పుల్గాచర్ల గ్రామం నుంచి కల్వరాల గ్రామానికి మిషన్ భగీరథ పైపులైను గురించి జూపల్లి కృష్ణారావు మంత్రి దృష్టికి తీసుకువెళ్ల గా సంబంధిత అధికారులకు మాట్లాడి తరగతిగా పనులు చేపట్టి కల్వరాల గ్రామానికి మిషన్ భగీరథ నీళ్ల ఇవ్వాలని ఆదేశించారు. కొన్ని సంవత్సరాల నుంచి పైపులైన్లు పగిలిపోవడం, వివిధ సమస్యల నుండి పూర్తిస్థాయిలో పాడై పోయే విధంగా ఉన్నాయని దానికి ఐరన్ పైపులు వేయడం జరుగుతుంది వారు తెలిపారు మిషన్ భగీరథ శరవేగంగా పనులు జరుగుతున్నాయి వారు అన్నారు త్వరలో కల్వరాల గ్రామానికి మిషన్ భగీరథ నీళ్ల అందించే విధంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి అని పనులను సందర్శించిన కల్వరాల గ్రామ సర్పంచ్ బండారి రాముడు, తెలిపారుకల్వరాల గ్రామానికి ఎస్సీ సబ్ ప్లాన్ విధులు 26 లక్షల మంజూరు చేయించడం జరిగిందని గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ సిసి రోడ్లు మంజూరు చేయించిన రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు ఆదేశాల మేరకు ఆదివారం ఎస్సీ కాలనీలో సిసి రోడ్లకు పంచాయతీరాజ్ ఏఈ మస్తాన్, తీసుకువచ్చి చూయించడం జరిగిందని వారు తెలిపారు . ఈ కార్యక్రమంలో వార్డు మెంబర్. ఎల్ల స్వామి కాంగ్రెస్ రమేష్ గౌడ్, అఖిల్, పెంటయ్య వెంకటస్వామి, నరసింహ, తదితరులు పాల్గొన్నారు.

## రూ.200 కోట్లతో సేవాలాల్ ఆలయ నిర్మాణం

**ఉప్పునుంతల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** అచ్చంపేట నియోజకవర్గంలోని మద్దిమడుగు శ్రీ ఆంజనేయ స్వామి సన్నిధిలో 20 ఎకరాలలో రూ. 200 కోట్లతో సేవాలాల్ మహారాజు ఆలయం నిర్మాణం చేపట్టనున్నట్లు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించినట్లు తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సభావట్ బిచ్చ నాయక్ తెలిపారు. ఆదివారం హైదరాబాదులో బంజారా భవనంలో సేవాలాల్ మహారాజ్ 287వజయంతి సందర్భంగా జరిగిన భోగ్ బండార్ కార్యక్రమానికి హాజరైన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ప్రకటించడం పట్ల వారు ఆయనకు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. మద్దిమడుగు ప్రాంతంలో సంతోష్ సేవాలాల్ ఆలయ నిర్మాణం చెప్పడానికి కృషి చేసిన అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, నాగర్ కర్నూల్ పార్లమెంట్ సభ్యులు డా. మల్లు రవి, గిరిజన మంత్రులకు, గిరిజన ఎమ్మెల్యేలకు తెలంగాణ గిరిజన ఉద్యోగుల సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షులు సభావట్ బిచ్చ నాయక్,అచ్చంపేట తాలూకా గిరిజన సేవా సంఘం అధ్యక్షు లు లచ్చు నాయక్, ప్రధాన కార్యదర్శి దగ్గ్యా నాయక్, తెలంగాణ గిరిజన ఉద్యోగ సంఘం అచ్చంపేట డివిజన్ అధ్యక్షులు శంకర్ రాథోడ్, ప్రధాన కార్యదర్శి రాజగోపాల్‌లు వారికి ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు.

## కనుల పండుగ కళ్యాణోత్సవం

**మొదటి పేజీ తరువాయి భాగం..**

అభివృద్ధి దిశగా చర్యలు తీసుకుంటామని, స్థానిక చెంచు గిరిజనులకు ఉపాధి అవకాశాలు కల్పించే విధంగా ప్రణాళికలు సిద్ధం చేస్తామని తెలిపారు. మహాశివరాత్రి సందర్భంగా ప్రజలందరూ కూడా సుఖ సంతోషాలతో ఉంటూ ఆ పరమేశ్వరుని అనుగ్రహం ఉండాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆ పరమశివుని కరుణా కటాక్షాలతో అచ్చంపేట నియోజకవర్గం, నాగర్ కర్నూల్ జిల్లా ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని కోరుకుంటూ ప్రజలందరికీ మహా శివరాత్రి పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.

## సర్వం శివమయం...

**మహాశివరాత్రి వేడుకలతో పులకించిన కౌకుంట్ల**

**దేవరకద్ర,ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం కౌకుంట్ల మండల కేంద్రంలోని శివాలయంలో భక్తజన సందోహంతో కళకళలాడాయి. జగమంతా శివమయంగా మారగా, తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు భారీగా తరలివచ్చి పరమశివుడికి భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివలింగానికి అభిషేకం చేస్తున్న అర్చక స్వామి మఠం సురేష్ స్వామి పంచామృతాభిషేకాలు, బిల్వార్చనలు, పుష్పార్చనలు చేసి అష్టోత్తర శతనామావళి పారాయణంతో శివనామస్మరణలో మునిగిపోయారు.ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు సాయంత్రం అనంతరం ఆలయాలకు చేరుకుని అభిషేకాలు చేసి, పండ్లు, పత్రి, పుష్పాలు సమర్పించారు. రాత్రివేళ జాగరణ చేసి శివ శివ నామస్మరణతో భజన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కౌకుంట్ల మండల ప్రజలు మహిళలు తదితరులు పాల్గొన్నారు.

**బిజినేపల్లి, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో శైవ క్షేత్రాలు భక్తిశ్రద్ధలతో, శివనామస్మరణతో మార్మోగాయి. భక్తులు తెల్లవారు జాము నుంచే ఆలయాలకు తరలివచ్చి, ఉపవాస దీక్షలు చేస్తూ, అభిషేకాలు, పూజలు, జాగరణలతో శివుణ్ణి ఆరాధించారు. నంది వడ్డేమాన్, మార్కండేయ క్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు శనివారం పెద్దఎత్తున తరలి వచ్చి స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



ప్రత్యేక పూజలు పాల్గొన్న భక్తులు

**బాలానగర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** మహాశివరాత్రి సందర్భంగా భక్తులు భక్తిశ్రద్ధలతో ఉపవాసం ఆచరించారు. మండల పరిధిలో గల శివాలయాలు భక్తులతో కిక్కిరిసిపోయాయి. ఆలయాల పరిసర ప్రాంతాలు శివనామస్మరణతో మారుమోగాయి. మహాశివరాత్రి రోజు ఉపవాసం ఆచరించి, శివుని దర్శనం చేసుకుంటే అంతా శుభం కలుగుతుందని భక్తుల నమ్మకం. భక్తులందరూ భక్తిశ్రద్ధలతో ఉపవాసం ఆచరించి, శివయ్య దర్శనం కోసం భారులు తీరి, శివయ్యను దర్శనం చేసుకున్నారు.



ప్రత్యేక పూజలు పాల్గొన్న భక్తులు

# ఘనంగా సంతు సేవాలాల్ జయంతి వేడుకలు

**కోయిలకొండ ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** గిరిజనుల ఆరాధ్య దైవమైన సంతు సేవాలాల్ జయంతి వేడుకలను ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన మండల కేంద్రమైన కోయిలకొండలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల నుంచి గిరిజనులు మండల కేంద్రానికి చేరుకొని స్వామి వివేకానంద చౌరస్తా ప్రాంతంలో గిరిజన సాంప్రదాయ దుస్తులను ధరిస్తూ నృత్యాలు చేస్తూ, శ్రీరామకొండ దిగువ భాగమున గల సంతు సేవాలాల్ మహారాజ్ ఆలయం వరకు చేరుకొని అక్కడ స్వామివారికి గిరిజనులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకలకు పలువురు హాజరయ్యారు. వేడుకలకు హాజరైన గిరిజనులకు ఉబ్బడి తండా సర్పంచ్ హరి సింగ్ నాయక్ అన్నదానాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు, నాయకులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

### అయ్యప్ప కొండపై సేవాలాల్ జయంతి

**మహబూబ్‌నగర్ టౌన్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** మహబూబ్‌నగర్ పట్టణ కేంద్రంలోని అయ్యప్ప కొండ ప్రాంతంలో లంబాడా/బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి సందర్భంగా పూలు పండ్లతో పాటు గోర్ బోలి భాష లో అర్దాస్ (వినతి) చేసారు. సంత్ శ్రీ సద్గురు సేవాలాల్ మహారాజ్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా గిరిజన భవన్ డెవలప్మెంట్ కమిటీ చైర్మన్ రామావత్ శేఖర్ నాయక్, కన్వీనర్ కేతావత్ శేఖర్ నాయక్, మహబూబ్‌నగర్ జిల్లా గిరిజన సేవా సంఘం కోశాధికారి కిషన్ పవర్, జిల్లా గిరిజన ఉద్యోగుల సంఘం అధ్యక్షులు పాత్లవాత్ గంగారాం నాయక్, ప్రధాన కార్యదర్శి రాత్లావత్ సుభాష్ రాథోడ్, ఉద్యోగ సంఘం నాయకులు విస్లావత్ హనుమంతు నాయక్, శంకర్ నాయక్, గౌరవ చైర్మన్ విస్లావత్ గోవర్ధన్ నాయక్, చైర్మన్ రామావత్ రవి రాథోడ్, వైస్ చైర్మన్ ఝరప్ల రామచందర్ నాయక్, కార్యవర్గ కమిటీ సభ్యుడు మూడవాత్ సంతోష్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు.

### నేడు జడ్చర్లలో మహా ర్యాలీ

**జడ్చర్ల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** జడ్చర్లలో వైభవంగా శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జడ్చర్ల ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో నిర్వహించారు. మహా భోగ్ భండార్, మహా ర్యాలీ, మహా అన్నదానం కార్యక్రమాలను సోమవారం ఉదయం 9 గంటల నుండి సాయంత్రం 4 వరకు వైభవంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. జడ్చర్ల పట్టణంలో సోమవారం బంజారాల ఆరాధ్య దైవం సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలకు జడ్చర్ల నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాల నుంచి ఇటీవల ఎన్నికైన సర్పంచులు, ఉప సర్పంచులు, వార్డు సభ్యులు, మాజీ ప్రజాప్రతినిధులు, గిరిజన ఉద్యోగులు, బంజారా యువ నాయకులు, మహిళలు భారీ సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, జడ్చర్లలో మహా ర్యాలీ నిర్వహించిన అనంతరం ఎంపీడీవో కార్యాలయంలో మహా భోగ్ భండారో, మహా అన్నదానం కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా జడ్చర్ల శాసనసభ్యులు జనంపల్లి అనిరుద్ రెడ్డి హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న వారు సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ జయంతి ఉత్సవ కమిటీ ఇంచార్జీ వడ్త్యావత్ రమేష్ నాయక్, అధ్యక్షులు కాట్రావత్ గంగ్యా నాయక్, గౌరవ అధ్యక్షులు గోపాల్ నాయక్, వడ్త్యావత్ లక్ష్మీ శంకర్ నాయక్,కౌన్సిలర్ చైతన్య చౌహాన్,లోకేష్ నాయక్,రవీందర్,వెంకటేష్, ఆంగోత్ మహేష్ నాయక్, బొట్టు రాజు నాయక్,రామ్ గోపాల్,సూర్య నాయక్,దినేష్ నాయక్ పాల్గొన్నారు.



నృత్యాలు చేస్తున్న గిరిజనులు

### బల్సర్ గొండ తాండలో సేవాలాల్ శోభాయాత్ర

**గండీడ్ ఫిబ్రవరి 15,ప్రభాతవార్త:** గండీడ్ మండల పరిధిలో బల్సుర్ గోన్ డా తాండ. చెన్నాయిపల్లితండా లో ఆదివారం సంత్ సేవాలాల్ మహారాజ్ 287 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. అంతేకాకుండా బంజారా సంస్కృతి ప్రతిబింబించేలా ఆటపాటలతో గ్రామంలో ఊరే గింపుగా శోభాయాత్ర నిర్వహించారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజా కార్యక్రమాలు అన్నదాన కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. సేవాలాల్ మహారాజ్ సత్యం ఐక్యతకు ప్రతీ క అని ఆయన చూపిన ఆధ్యాత్మిక మార్గంలో నడవాలని తాండా పెద్దలు యువకులు స్మరించుకున్నారు. ఈ కార్యక్రమంలో తాండ పెద్దలు యువకులు మహిళలు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.



సేవాలాల్ జయంతి వేడుకలు నిర్వహిస్తున్న దృశ్యం



శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి వేడుకల్లో ఉత్సవ కమిటి



తండాలో శోభాయాత్ర నిర్వహించిన తండావాసులు

## మహబూబ్‌నగర్ నుంచి గుడేబల్లూర్‌కు నాలుగు లైన్ల హైవే

**మహబూబ్‌నగర్ నుంచి ఈ ప్రాంతాల మీదుగా కేంద్రం గ్రీన్ సిగ్నల్**

**ప్రధాని మోదీ, ఎంపీ డీకే అరుణమ్మకు ధన్యవాదాలు**

**బిజెపి మండల అధ్యక్షులు నల్లె నరసప్ప**



మాట్లాడుతున్న మండల బిజెపి నాయకులు

**కృష్ణ,ఫిబ్రవరి 15 ప్రభాతవార్త :** కర్ణాటక సరిహద్దు కలిగిన తెలంగాణ మారుమూల ప్రాంతం గుడేబల్లూర్ నుంచి మహబూబ్‌నగర్ వరకు నాలుగు లైన్ల హైవే రోడ్డు మంజూరు చేయడం పట్ల బీజేపీ కృష్ణ మండల అధ్యక్షులు నల్లే నరసప్ప హర్షం వ్యక్తం చేశారు. కేంద్ర ప్రభుత్వం శ్రీ నరేంద్ర మోడీ అధ్యక్షతన నిన్న జరిగిన మంత్రి మండలి క్యాబినెట్ సమావేశంలో తెలంగాణలోని గుడేబల్లూర్ నుండి మహబూబ్‌నగర్ వరకు నాలుగు లైన్ల జాతీయ రహదారి నిర్మాణానికి గాను గ్రీన్ సిగ్నల్ ఇచ్చి రూ. 3175 కోట్లు నిధులు మంజూరుతో 80. 01 కిలోమీటర్ల ప్రాజెక్టు మన ప్రాంతాన్ని హైదరాబాద్ గోవా కారిడార్‌తో అను సంధానం చేయడం చాలా సంతోషకరమైన విషయమని ఆయన అన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన కృష్ణ మండల బిజెపి అధ్యక్షులు నల్లె నర్సప్ప, మాజీ అధ్యక్షులు శ్రీనివాసులు ఇది ప్రయాణ సమయాన్ని తగ్గించి వాణిజ్య ఆర్థిక ప్రగతిని వేగవంతం చేస్తుందని పేర్కొన్నారు. ప్రాజెక్టు కృష్ణా మండల ప్రజలకు గౌరవ ప్రధాని నరేంద్ర మోడీ ఇచ్చిన గొప్ప బహుమతని బీజేపీ కృష్ణ మండల శాఖ తరపున దేశ ప్రధాని నరేంద్ర మోడీకి మంత్రి మండలికి పార్లమెంట్ సభ్యులు డీకే అరుణమ్మకు హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. మోదీ దూరదృష్టి రహదారుల అభివృద్ధికి అంకితభావంతో మా ప్రాంత ప్రగతికి మూలాధారం అవుతున్నాయన్నారు. ఈ అవకాశాన్ని మనం సద్వినియోగం చేసుకొని మన ప్రాంతం మరింత ముందుకు వెళ్లాలని కోరుకుంటున్నామని అన్నారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శులు దండు రాఘవేంద్ర, కరిమని తిమ్మప్ప, సచిన్ బట్ పాల్గొన్నారు. కాగా మహబూబ్‌నగర్ గుడేబల్లూర్ ప్రాజెక్టు "హైదరాబాద్ టు గోవా కారిడార్" లో భాగంగా ఉంది. దీనివల్ల హైదరాబాద్ నుంచి రాయచూర్, మంత్రాలయం, గోవా వెళ్లే ప్రయాణికులకు ప్రయాణ సమయం గణనీయంగా తగ్గుతుంది. ఈ రహదారి మహబూబ్‌నగర్ నుంచి మొదలై దేవరకద్ర, మరికల్, మక్తల్, మాగనూర్ మీదుగా గుడేబల్లూర్ వరకు సాగుతుంది.

## హంగుపై ప్రధాన పార్టీల అస్త్రాలు..

**మొదటి పేజీ తరువాయి భాగం..**

సీట్లు రాకపోవడంతో గద్వాలలో ఒక్కసారి క్యాంపు రాజకీయాలు వేడెక్కాయి. హైదరాబాద్, కర్ణాటక కేంద్రాలుగా ప్రధాన పార్టీల గ్రూప్ రాజకీయాలు నడుస్తుండటం హాట్ టాఫిక్ మారింది.గద్వాల మున్సిపాలిటిలో మొత్తం37 వార్డులకు గాను కాంగ్రెస్ కు16,బీఆర్ఎస్‌కు11, బీజేపీకి7,ఎంఐఎం 1, స్వతంత్రులు ఇద్దరు గెలుపొందారు. మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ ఎన్నికకు కావాల్సిన మ్యాజిక్ ఫిగర్ 19కాగా ప్రస్తుతం ఏ ఒక్క ప్రధాన పార్టీకి మెజార్టీ స్థానాలు దక్కలేదు. దీంతో గద్వాలలో నాటకీయ పరిణామాలు చోటు చేసుకున్నాయి. తెలంగాణ మున్సిపల్ ఎన్నికల ఫలితాల నేపథ్యంలో




ఈనెల 16న మేయర్, మున్సిపల్ చైర్మన్ల ఎన్నికకు రాష్ట్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ రోజు మధ్యాహ్నం 12.30 గంటలకు నిర్వహించే ప్రత్యేక సమావేశంలో కొత్తగా ఎన్నికైన సభ్యుల ప్రమాణ స్వీకారంతో పాటు, పరోక్ష పద్ధతిలో కీలక పదవుల భర్తీ ప్రక్రియ పూర్తికానుంది. దీంతో మెజార్టీ స్థానాలు కైవసం చేసుకున్న కాంగ్రెస్ బీఆర్ఎస్ పార్టీలు ఎవరికివారే ఎత్తుకు పై ఎత్తులు వేస్తూ క్యాంపు రాజకీయాలు కొనసాగిస్తున్నారు. ఎలాగైన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ దక్కించుకోవడానికి వేగంగా పావులు కదుపుతున్నారు. ఇండిపెండెంట్ కౌన్సిలర్ల మద్దతు కోరడమా లేక ఎక్స్ అఫిషియో ద్వారా చైర్మన్ కుర్చీ కైవసం చేసుకోవడమా అనేది గద్వాల జిల్లా కేంద్రంలో జోరుగా చర్చ నడుస్తోంది.వారికి బంపర్ ఆఫర్..గద్వాల మున్సిపల్ పరిధిలోని 37 వార్డులకు గాను ఇండిపెండెంట్ లు రెండు వార్డులో, మరో వార్డులో ఎంఐఎం అభ్యర్థి కౌన్సిలర్ లుగా గెలుపొందారు. వారికి బంపర్ ఆఫర్ తగిలే అవకాశమున్నట్లు తెలుస్తోంది. మున్సిపల్ చైర్మన్ ఎన్నిక రోజున మద్దతు తెలిపేందుకు బంపర్ ఆఫర్ లతో గాలం వేశారనే ప్రచారం జోరుగా జరుగుతోంది.

## నేడు ట్రాఫిక్ ఆంక్షలు

**మేయర్ ఎంపిక నేపథ్యంలో ట్రాఫిక్ మళ్లింపు**

**ప్రజలు సహకరించాలి**

**మహబూబ్‌నగర్ డిఎస్‌పి వెంకటేశ్వర్లు**



డీఎస్పీ వెంకటేశ్వర్లు

**మహబూబ్‌నగర్ క్రైం, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మహబూబ్‌నగర్ పట్టణం సోమవారం మహబూబ్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయంలో మేయర్ పదవి ఎన్నిక కార్యక్రమం నిర్వహించబడనున్న నేపథ్యంలో పట్టణంలో ట్రాఫిక్ నియంత్రణ చర్యలు చేపట్టినట్లు మహబూబ్‌నగర్ డిఎస్పి వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ సందర్భంగా ఉదయం 9 గం.ల నుండి సాయంత్రం 5 గం.ల వరకు గడియారం చౌరస్తా నుండి అశోక్ థియేటర్ చౌరస్తా వరకు రాకపోకలకు తాత్కాలిక ట్రాఫిక్ ఆంక్షలు అమలు చేయబడతాయని తెలిపారు. ఎన్నికల కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు అధిక సంఖ్యలో హాజరయ్యే అవకాశం ఉన్నందున ట్రాఫిక్ రద్దీ నివారించేందుకు ఈ చర్యలు తీసుకున్నట్లు ఆయన పేర్కొన్నారు. అత్యవసర సేవల వాహనాలకు అనుమతి ఇవ్వబడుతుందని, ఇతర వాహనదారులు ప్రత్యామ్నాయ మార్గాలను వినియోగించాలని సూచించారు. పట్టణ ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్ పోలీసులకు సహకరించి ఆంక్షలను పాటించి కార్యక్రమం ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని డిఎస్పి వెంకటేశ్వర్లు కోరారు.

## నచికేతన్‌లో ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న నాయకులు

**జడ్చర్ల, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** మహాశివరాత్రి సందర్భంగా జడ్చర్ల మండలంలోని కొడుగల్ గ్రామ శివారులోని నచికేతన తపోవనంలో శివలింగాన్ని దర్శించుకున్నారు. శివుడికి, విఘ్నేశ్వరుడు, సీతారామచంద్రులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భగవంతుని కృపతో ప్రజలందరు సుభిక్షంగా ఉండాలని కోరుకున్నారు. పూజలో జడ్పి మాజీ వైస్ చైర్మన్ కొడుగల్ యాదయ్య, కౌన్సిలర్ కోట్ల ప్రశాంత్ రెడ్డి, కరాటే శ్రీను, శివ ప్రసాద్, ప్రసాద్, సోమశేఖర్ పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ హయాంలోనే గిరిజనుల సంక్షేమం





సంతుసేవాలాల్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

**తండాలను పంచాయతీలు చేసిన ఘనత కెసిఆర్ దే**

**సంతు సేవాలాల్ జయంతి వేడుకల్లో**

**మాజీ మంత్రి, బిఆర్ఎస్ మహబూబ్‌నగర్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి**

**రాజాపూర్, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** తండాలను పంచాయితీలు చేసి, స్వయం పాలన అధికారం అవకాశం కల్పించిన ఘనత బిఆర్ఎస్ పార్టీకి కెసిఆర్‌కే దక్కుతుందని మాజీ మంత్రి లక్ష్మారెడ్డి స్పష్టం చేశారు. బంజారాల ఆరాధ్య దైవం,గిరిజనుల ఆధ్యాత్మిక మార్గదర్శి సంత్ శ్రీ సేవాలాల్ మహారాజ్ 287 జయంతి ఉత్సవాలు రాజాపూర్ లో ఘనంగా నిర్వహించారు. మాజీ మంత్రి లక్ష్మారెడ్డి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై అనంతరం మాట్లాడారు. జడ్చర్ల నియోజకవర్గ గిరిజనులకు శ్రీ సంత్ సేవాలాల్ మహారాజ్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. రాష్ట్రమంతటా సేవాలాల్ మహారాజ్ జయంతి ఘనంగా జరుపుకుంటున్నామన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత అధికారికంగా జరుపుకుంటున్నామని గుర్తు చేశారు. ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తరువాత గిరిజన తండాల్లో ఎంతో మార్పు వచ్చిందని, రాజకీయంగా ఎంతో చైతన్యం వచ్చిందన్నారు. ముఖ్యంగా తండాలను గ్రామ పంచాయతీ లుగా చేయాలనే దశాబ్దాల డిమాండ్ ను బీఆర్ఎస్ నెరవేర్చిందని చెప్పారు. గిరిజన సోదరసోదరీమణులు సర్పంచ్,ఉప సర్పంచ్,వార్డు మెంబర్ లుగా స్వయం పాలన చేస్తున్నారని అందుకు అడుగులు వేసింది బీఆర్ఎస్ పార్టీ అని స్పష్టం చేశారు. రిజర్వేషన్ లు పెంచుకోవడం జరిగిందని, ఇలా గిరిజనుల అభివృద్ధికి అనేక కార్యక్రమాలు చేపట్టామని లక్ష్మారెడ్డి గుర్తు చేశారు. మిషన్ భగీరథతో మహిళల తాగునీటి కష్టాలు తీర్చామన్నారు. సేవాలాల్ మహారాజ్ గుడి నిర్మాణానికి స్థలాలు కేటాయించుకున్నామని గుర్తు చేసారు.

## మృతుడి కుటుంబానికి ఆర్థికసాయం అందజేత



**వెల్దండ, ఫిబ్రవరి 15 ప్రభాతవార్త:** వెల్దండ మండల పరిధిలోని కొట్ర గ్రామనికి చెందిన నాయిని రుక్కయ్య మృతి చెందారు. ఆదివారం మృతుని కుటుంబాన్ని కాంగ్రెస్ యువజన కాంగ్రెస్ మాజీ మండల అధ్యక్షులు కదారి శ్రీనివాస్ పరామర్శించి తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. రూ.5 వేల ఆర్థిక సహాయం అందజేసి కుటుంబానికి అన్ని విధాలుగా అండగా ఉంటానన్నారు. పరామర్శించిన వారిలో గ్రామస్తులు ఉడుత వెంకటయ్య యాదవ్, చిట్టి, లక్ష్మి ్ర, శ్యాంపూరి అల్లాజీ, శ్యాంపూరి లక్ష్మయ్య, పోలే మోని రవి, నీరటి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



# మహాశివరాత్రి పర్వదినాన కిక్కిరిసిపోయిన మహా లింగేశ్వర స్వామి ఆలయం

**భక్తుల సౌకర్యాలపై పర్యవేక్షిస్తున్న సిఐ నరహరి**

**కేశంపేట, ఫిబ్రవరి 15, ప్రభాత వార్త:** మహాశివరాత్రి పురస్కరించుకుని మహాలింగేశ్వర ఆలయానికి భక్తులు కిక్కిరిసిపోయారు. కేశంపేట మండల పరిధిలోని కాకునూరు గ్రామ సమీపంలో స్వయంభుగా వెలసిన శ్రీ మహా లింగేశ్వర స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులు ఉపవాస దీక్షలతో భక్తిశ్రద్ధలతో పిల్లాపాపలతో ఆదివారం శివనామస్మరణతో ఆలయ పరిసరాలు మారుమోగాయి. బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సిఐ నరహరి తమ సిబ్బందితో కలిసి ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ ప్రాంగణంలో త్రాగునీరు పార్కింగ్, ట్రాఫిక్ నియంత్రణ తదితర ఏర్పాట్లను ఆలయ ధర్మకర్తలతో కలిసి ఆయన పరిశీలించారు. సందర్భంగా సిఐ నరహరి మాట్లాడుతూ పార్టీలకతీతంగా అందరూ సమన్వయంగా ఉంటూ దైవ కార్యక్రమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించి ఆ దేవుడి కృపకు అందరూ పాత్రులు కావాలని అన్నారు, ఆలయ ప్రాంగణంలో ఎవరైనా ఇబ్బందులకు గురి చేస్తే వెంబడే పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని ఆలయ కమిటీ నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మహాలింగేశ్వర స్వామి ఆలయ చైర్మన్ ఎదిరే మల్లేష్, మరియు కోడూరు శ్రీశైలం, పంది లింగం, గోపని భీమయ్య, ఎగిరే కృష్ణ,మల్లేష్, వడ్ల రఘు, పోలీస్ కానిస్టేబుల్ అశోక్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భ్రమరాంబ మల్లికార్జున కల్యాణోత్సవం

**హాజరైన ఎమ్మెల్యే కసిరెడ్డి, టాస్క్ సిఈవో సుంకిరెడ్డి**

**తలకొండపల్లి ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** తలకొండపల్లి మండల పరిధిలోని చుక్కాపూర్ గ్రామంలో గల మల్లప్ప గుట్టపై వెలసిన శ్రీ మల్లికార్జున స్వామి కళ్యాణ్ఉత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, టాస్క్ సీఈవో సుంకిరెడ్డి రాఘవేందర్ రెడ్డిలు ముఖ్యఅతిథిగా హాజరైనారు. ఈ సందర్భంగా కళ్యాణ్ ఉత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. సందర్భంగా వారు మాట్లాడుతూ శివరాత్రి సందర్భంగా మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం ప్రత్యేక పూజలో పాల్గొన్నారు. కార్యక్రమంలో చెన్నారం సర్పంచ్ రజిత రాజు నాయక్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు. రాంపూర్‌లోతలకొండపల్లి మండల పరిధిలోని రాంపూర్ గ్రామంలో నిర్వహించిన శివరాత్రి ఉత్సవాలు ఘనంగా జరిపారు. గ్రామ సర్పంచ్ పట్టేలా నిర్మల శ్రీశైలం యాదవ్ ఆధ్వర్యంలో గ్రామంలోని శివాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి శివపార్వతుల కల్యాణోత్సవం నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ ఆంజనేయులు మాజీ సర్పంచ్ మనమ్మయ్య కటికల యాదయ్య తదితరులు పాల్గొన్నారు.



మల్లికార్జున స్వామి కళ్యాణోత్సవం లో పాల్గొన్న నారాయణరెడ్డి

## పూడూరు మండలంలో ..

**పూడూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** మహా శివరాత్రి (పండుగ)పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం పూడూరు మండలంలోని ఆయా గ్రామాల్లో వెలసిన శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి.పవిత్రంగా భావించే (దేవదేవుడు)శివుడి ఒక్కపోద్దుకోసం భక్తులు ఉదయాన్నేలేచి ఇళ్లను శుభ్రపరుచుకొని,స్నానాలు ఆచరించి ఉపవాసదీక్షలు



పూడూరు మండల కడ్మూరు శివాలయంలో భారులు తీరిన భక్తులు

చేపట్టారు.లింగ స్వరూపుడికి అభిషేకాలు పూజలు చేసేందుకు భక్తులు భారులు తీరారు.కంకల్ వీరబద్రేశ్వరాలయం,కడ్మూరు శివాలయాల్లో భక్తులు సందడిగా కనిపించారు. అంగడిచిట్టంపల్లి ,చెన్‌గోముల్, సోమన్‌గుర్తి,



శివాలయంలో ఉపవాస ధీక్షలు విరమిస్తున్న భక్తులు

మంచన్‌పల్లి,ఎన్కెపల్లి తదితర గ్రామాల్లోని శివాలయాల్లో భక్తుల రద్దీ కనిపించింది.మండలం పరిధిలోని రాకంచెర్ల శ్రీ లక్ష్మీనర్సింహ్మ స్వామి దేవాలయం,పెద్ద ఉమ్మెంతాల్ శ్రీ తిరుమలనాధస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.సాయంత్రం సమయంలో మండలంలోని ఆయా గ్రామాల్లో వెలసిన ఆలయాలకు వెళ్లిన భక్తులు అర్ధకర్జూర పండు,కొబ్బరి తీర్ధాలను సేవించి ఉపవాస దీక్షలను విరమించారు.రాత్రి సమయంలో జాగరణకోసం ఆయా గ్రామాల్లోని దేవాలయాల్లో భజనలు,సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.కాగా శివరాత్రి పండుగ సందర్భంగా మండలం పరిధిలోని మన్నెగూడ,చెన్‌గోములు,పూడూరు,కంకల్ తదితర గ్రామాల్లో భారీగా పండ్ల దుకాణాలు వెలిసాయి.పండ్లకు ఎనలేని గిరాకీ ఉన్నందున విక్రయ దారులు సాధారణ రోజుల్లోకంటే పండ్ల ధరలను అమాంతం పెంచేశారు.



## యాచారంలో...

**యాచారం,ఫిబ్రవరి 15, ప్రభాతవార్త :** మహాశివరాత్రి పర్వదినం పురస్కరించుకొని యాచారం మండల పరిధిలోని 24 గ్రామపంచాయతీలలో ఆయా గ్రామాలలో గల శివాలయాలు రామాలయాలు వివిధ ఆలయాలలో పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు నిర్వహించి భక్తులు ఉపవాసాలను ముగించారు. యాచారం సీఐ నందీశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో ఆలయాలలో శాంతి మొదట అంశాలను క్షుణ్ణంగా పరిశీలించి పరిస్థితులకు అనుగుణంగా ఏర్పాట్లు చేయించారు,మరింత కట్టుదిట్టంగా చేయాలని నిర్వాహకులకు సూచన చేశారు. యాచారం మండల పరిధిలోని నంది వనపర్తి గ్రామంలోని ఓంకారేశ్వరాలయం నందీశ్వరాలయం సిద్దేశ్వరాలయంలో భక్తులు ఉదయం నుండి సాయంత్రం వరకు ఆలయంలో స్వామి వారి దర్శించుకుంటూ ప్రత్యేక పూజలు నిర్వహించారు. సిద్దేశ్వర ఆలయంలో సామూహిక సత్యనారాయణ వ్రతాలు చేసి భక్తులు భక్తి చాటుకున్నారు. నందీశ్వరాలయం సిద్దేశ్వరాలయంలో తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ కమిషన్ చైర్మన్ ముదిరెడ్డి కోదండ రెడ్డి దంపతులు ప్రత్యేక పూజలు నిర్వహించి ఆలయంలో మొక్కు తీర్చుకున్నారు. నందీశ్వరాలయంలో ఉదయం నుండి సాయంత్రం వరకు ఏకధాటిగా భక్తులు రద్దీలో సేవకులు క్రమశిక్షణతో దర్శనానికి ఏర్పాటు చేసి వసతులు కల్పించారు. సిద్దేశ్వరాలయంలో సాయంత్రం భక్తులకు ఉపవాసం అనంతరం సంస్కృత కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమంలో రాచర్ల వెంకటేశ్వర్లు, బిలకంటి చంద్రశేఖర్ రెడ్డి, కొంగళ్ల జోగిరెడ్డి,కంబాలపల్లి మల్లారెడ్డి, తెల్గమల్ల రవీందర్,సంగం రాజు, మహేందర్ రెడ్డి, కాళ్ళ జంగయ్య, నక్క మహేందర్,నుకం మహేందర్ ముచర్ల వెంకటరమణ, పంది సుధాకర్, తదితరులు పాల్గొన్నారు

## నందిగామలో దేవాలయాలు కిటకిట

**(నందిగామ ఫిబ్రవరి 15 ప్రభాతవార్త) :** నందిగామ మండలంలో ఆదివారం మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆయా గ్రామాల్లో వెలిసిన



నందిగామ శివాలయంలో పూజలు చేస్తున్న సర్పంచ్ కొమ్ము కృష్ణ తదితరులు

శివాలయాలు శివనామ స్మరణతో మార్మోగాయి. నందిగామ మండల కేంద్రంలో ఉన్న శ్రీ శివ రామాంజనేయ స్వామి దేవాలయంలో మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకొని నందిగామ సర్పంచ్ కొమ్ము కృష్ణ, ఉప సర్పంచ్ వెంకటేష్ గౌడ్ లు పరమశివునికి పూజలు చేశారు. శివయ్య కరుణ, కృపా, కటాక్షంతో ప్రజలందరికీ మంచి జరగాలని వారు భగవంతుని వేడుకున్నారు. ఈ పూజల్లో మాజీ ఎంపిటీసీ దామోదర్ రెడ్డి, వార్డు సభ్యులు అగ్గిప్రసాద్, అగ్గి మమతా సూరి, బొమ్మ గళ్ళ నర్సింలు, టైలర్ కృష్ణ, నాయకులు పాలమాకుల పెంటయ్య గౌడ్,ధార లింగం, సి కృష్ణ గౌడ్, కుందారం వెంకటరెడ్డి , అడ్వకేట్ అంజి యాదవ్, పూర్ణం శ్రీకాంత్,అంతయ్య తదితరులు ఉన్నారు.

మైసిగండి శివాలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న దృశ్యం

## భక్తిశ్రద్ధలతో మహాశివరాత్రి

**కడ్తాల్, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త:** కడ్తాల్ మండలం మైసిగండి మైసమ్మ శివాలయం, రామాలయం దేవస్థానంలో శ్రీ కాశీ విశ్వనాథ స్వామి మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని భక్తులతో ఆలయం కిక్కిరిసిపోయింది ఆదివారం ఆలయ ఫౌండర్ ట్రస్ట్ చైర్మన్ లక్ష్మి శిరోలి పంతు నాయక్, ఈఓ స్నేహలత, తాసిల్దార్ జ్యోతి దంపతులు, ఆర్ పి భాస్కర్ దంపతులు సిఐ గంగాధర్, ఎస్సై వరప్రసాద్, ప్రజా ప్రతినిధులతో కలిసి మహాశివరాత్రి సందర్భంగా శివాలయంలో అభిషేకం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు విఘ్నేశ్వర పూజ ధ్వజారోహణం, రుద్రాభిషేకం, భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు సిబ్బంది భక్తులు తదితరులు పాల్గొన్నారు.





## శివాలయంలో భజనలతో ఆధ్యాత్మిక పరవశం

**-గ్రామంలో శాంతి, ఐక్యత, అభివృద్ధి కలగాలి**
**- జడగూడెం కుటుంబ సభ్యులు**

**కొత్తూరు, ఫిబ్రవరి 15, ప్రభాతవార్త;** కొత్తూరు మున్సిపల్ కేంద్రంలోని శివనగర్ కాలనీలో ఉన్న కాశి విశ్వేశ్వర ఆలయం లో మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఆదివారం జడగూడెం కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు, అభిషేకాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం వేకువ జామున నుండే భక్తులు ఆలయానికి తరలివచ్చి దర్శించుకుని పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించారు. ఓం నమః శివాయ నామస్మరణలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. మహిళలు, యువత, వృద్ధులు ఉపవాస దీక్షలు చేపట్టి శివారాధనలో పాల్గొన్నారు. సాయంకాలం నిర్వహించిన ప్రత్యేక హారతులు, రుద్రాభిషేకం, భజనలు భక్తులను ఆధ్యాత్మిక పరవశంలో ముంచెత్తాయి. ఆలయాన్ని పూలతో అలంకరించి దీపాలంకరణ చేయడంతో శివనగర్ కాలనీ పండుగ వాతావరణాన్ని సంతరించుకుంది.

ఈ సందర్భంగా జడగూడెం కుటుంబ సభ్యులు మాట్లాడుతూ,ప్రతి సంవత్సరం మహా శివరాత్రిని ఇలాగే ఘనంగా నిర్వహించడం ఆనందంగా ఉంది. గ్రామ ప్రజలందరూ ఐక్యంగా పాల్గొని పండుగను విజయవంతం చేయడం ఎంతో సంతోషకరం. పరమేశ్వరుని ఆశీస్సులతో గ్రామంలో శాంతి, ఐక్యత, అభివృద్ధి కలగాలని కోరుకుంటున్నాం అని తెలిపారు. ఈ కార్యక్రమంలో జె సుదర్శన్ గౌడ్, జె వేణు గోపాల్, జె గోవర్ధన్ గౌడ్, జె శ్రీశైలం గౌడ్, జె శ్రీనివాస్ గౌడ్, జె విజయ్ గౌడ్, జె రామకృష్ణ, జె సురేందర్, మరియు తదితరులు పాల్గొన్నారు.

మాడ్గుల మండలం అర్కపల్లి కాశీ విశ్వేశ్వర వీరాంజనేయ స్వామి ఆలయంలో పండ్లతో అభిషేకం చేస్తున్న భక్తులు



మాడుగుల స్వయంభు శివాలయంలో నందీశ్వరుడు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న మాజీ కేంద్రమంత్రి జైపాల్ రెడ్డి సతీమణి లక్ష్మమ్మ



# శంకరా నమో నమః



శివలింగానికి అభిషేకం చేస్తున్న చిన్నారి



శివలింగానికి అభిషేకం చేస్తున్న మార్వాడీ దంపతులు



ఆంజనేయ స్వామి విగ్రహం ముందు భక్తుల సందడి



స్వామివారి దర్శనానికి వచ్చిన బసవన్న

**కీసర,ఫిబ్రవరి15,ప్రభాతవార్తః**

ప్రముఖ శైవ క్షేత్రమైన కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వస్వామి ఆలయంలో భక్తుల ఓంకార నాలు మిన్నంటాయి.మహాశివరాత్రి పర్వదినాన శ్రీ రామలింగేశ్వరుడి దర్శనార్ధం భక్తులు పోటెత్తారు.101 శివలింగాల రూపంలో దేవదేవుడు కొలువై ఉన్న క్షేత్ర పరిసరాలలో ఏ నోట విన్నా శివనామస్మరణే.ఏ వైపు చూసిన శివలింగ అభిషేక దృశ్యాలే దర్శనమిచ్చాయి.ఆదివారం తెల్లవారు జామున 3 గంటల నుంచి దర్శనాలు ప్రారంబమయ్యాయి.ఉదయం నుండే భక్తుల రద్దీ అధికంగా ఉన్నా మద్యాహ్నం తరువాత భక్తుల రద్దీ మరింత పెరిగింది.జిల్లా నుంచే కాకుండా జంట నగరాలు,వివిద ప్రాంతాల నుండి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు.స్వామి వారి సన్నిధిలో మహన్యాస పూర్వక రుద్రాభిషేకం,రుద్రస్వాహకార హోమం,యాగశాలలో రుద్ర,నవగ్రహ హోమాలు జరిగాయి.భక్తులకు ఆర్యవైశ్య నిత్యాన్నదాన సత్రం,రెడ్డి సంక్షేమ సంఘం,వంశీరాజ్ సంక్షేమ సంఘం తదితర సంస్థల ఆద్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

## అభిషేకాలు.. జాగరణ

శ్రీ రామలింగేశ్వరస్వామి దర్శనానంతరం ప్రధాన ఆలయానికి ఎదురుగా ఉన్న శివలింగాలకు భక్తులు అభిషేకాలు నిర్వహించారు.మహాశివరాత్రి పర్వదినం రోజున శివలింగాలకు అభిషేకాలు చేస్తే కుటుంబం సుఖసంతోషాలతో విలసిల్లుతుందని భక్తులు భావిస్తారు.శివలింగాలకుపాలు,తెనె,నెయ్యి,పంచదార ,పెరుగు ,పంచామృతాలతో అభిషేకాలు చేసి పూలతో పూజలు చేశారు.గర్భాలయంలోని మూలవిరాట్‌కి స్వయంగా అభిషేకాలు నిర్వహించడానికి వీలు లేకపోవడంతో ఆలయం పక్కనున్న ప్రాకార మండపంలో నిర్వహించిన సామూహిక అభిషేకాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.ప్రధాన ఆలయం పక్కనున్న కాశీవిశ్వేశ్వరాలయంలోని శివలింగాన్ని కూడా భక్తులు దర్శించుకున్నారు.ఉపవాస దీక్షలు చేపట్టిన భక్తులు స్వామి వారిని దర్శించుకుని దీక్షలు విరమించారు.

## ఆలయంలో నేటి పూజా కార్యక్రమాలు

మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నాలుగవ రోజైన సోమవారం ఉదయం 5.30 నిమిషాలకు మహన్యాస పూర్వక రుద్రాభిషేకం,ఉదయం 6 గంటలకు సామూహిక అభిషేకాలు (కళ్యాణ మండపంలో),సాయంత్రం 6 గంటలకు రుద్రస్వాహకార హోమం,రాత్రి 7 గంటలకు ప్రదోషకాల పూజ,హారతి,మంత్రపుష్పం,రాత్రి 8 గంటలకు శ్రీ స్వామివారి విమాన రధోత్సవం తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.



శివలింగానికి అభిషేకం చేస్తున్న భక్తులు

## స్వామి వారి సేవలో ప్రముఖులు

కీసరగుట్ట శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా స్వామి వారిని ప్రముఖులు దర్శించుకున్నారు.మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి,మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి,మల్కాజిగిరి ఎంపి ఈటల రాజేందర్,హర్యాన మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ,జిల్లా అదనపు కలెక్టర్ విజయేందర్‌రెడ్డి,అడ్వకేట్ జనరల్ సుదర్శన్‌రెడ్డి,ఎమ్మెల్యే రోహిత్ తదితరులు స్వామివారిని దర్శించుకున్నారు.

## కన్నల పండువగా స్వామి వారి కళ్యాణం

కీసరగుట్ట మహశివరాత్రి బ్రహ్మోత్సవాలలో ముఖ్య ఘట్టమైన శ్రీ భవానీ,శివదుర్గా సమేత శ్రీ రామలింగేశ్వరస్వామి వార్ల కళ్యాణం శనివారం రాత్రి అశేష భక్తజనుల సమక్షంలో శోభాయమానంగా జరిగింది.నందివాహన సేవ ద్వారా కీసరగుట్టకు స్వామివారు చేరుకోగానే కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.రాష్ట్ర ప్రభుత్వం తరపున రాష్ట్ర మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించి కళ్యాణంలో పాల్గొన్నారు.ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి ఆలయ చైర్మన్ వెంకటేష్,ఈఓ సుధాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ఆలయం ముందు శివలింగానికి నీటితో అభిషేకం చేస్తున్న భక్తురాలు



శివలింగానికి పూలతో అభిషేకం చేస్తున్న చిన్నారి



కీసరగుట్టలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు